క్లుప్తంగా

గొప్ప సంఘ సంస్కర్త రామ్మోహన్ రాయ్



రామ్మోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): రాజారామ్మోహన్ రాయ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్రాంత తెలుగు భాష ఉపాధ్యాయిని ఏబి త్రిపుర సుందరి అన్నారు. స్థానిక వవరుపేటలోని అన్నే భవన్‌లో కంప్యూటర్ సెంటర్ నందు రాజారామ్మోహన్‌రాయ్ 252వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి త్రిపుర సుందరి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా త్రిపుర సుందరి మాట్లాడుతూ నేటి విద్యార్థులు గత కాలపు త్యాగ జీవులు, మార్గదర్శకులు చేసిన కృషి, వారి త్యాగాలు తెలుసుకునే ఆసక్తి కలిగించడం కోసం ప్రయత్నంలో భాగంగా విజ్ఞాన కేంద్రం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ లక్ష్మి, సిద్దార్థ సాయి, జ్ఞానేశ్వరి, సుజీవ్,ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



రామారావుగూడెంలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దెందులూరు: మండలంలో రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామాల్లో మృతుల కుటుంబాలను వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, రామారావుగూడెం గ్రామ సర్పంచ్ పర్వతనేని శ్రావణి సుధీర్ పరామర్శించారు. రామారావుగూడెంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పేరం కృష్ణ కుటుంబ సభ్యులు పేరం ప్రసాద్, పేరం రామకృష్ణలను పరామర్శించారు. శ్రీరామవరంలో మృతి చెందిన చిలకా మెరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి వెంట రామారావుగూడెం, శ్రీరామవరం గ్రామ కమిటీ అధ్యక్షులు పర్వతనేని వెంకట్రాజు, అక్కినేని శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు కాలి ఇజ్రాయేలు, పార్టీ నాయకులు పర్వతనేని నరేంద్ర, బాబ్జి, పుల్లా వరప్రసాద్ తదితరులు ఉన్నారు.

మామిడి అధరహో...



స్థానిక ఓవర్ బ్రిడ్జి క్రింద మామిడి పండ్లను విక్రయిస్తున్న విక్రేత

- సామాన్యుడికి అందుబాటులో లేని మధుర ఫలం
- రకాన్ని బట్టి రూ.20 నుంచి రూ.30ల వరకు పలుకుతున్న ధర
- దిగుబడులు తగ్గడంతో కొంత మేరకు పెరిగిన గిరాకీ
- నూజివీడు, చింతలపూడి తదిర ప్రాంతాల నుంచి భారీగా
- ఏలూరుకు మామిడి పండ్లు

ఏలూరు (టూటౌన్): వేసవి కాలం అంటే మామిడి పండ్ల సీజన్. చూడగానే నోరూరించే మామిడి పండ్లను ఇష్టపడని వారంటూ ఉండరు. పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ వీటిని రుచిగా పిధా అవుతారు. ఈ కాలంలో చాలా మందికి మామిడి పండ్ల విక్రయాలే జీవనాధారం. రోడ్ల ప్రక్కన, షాపులలో, తోపుడు బండ్లపై విక్రయాలు జరుతూ ఉంటాయి. ఈ ఏడాది మామిడి పండ్లు దిగుబడ్లు తగ్గడంతో ధరలు చుక్కల్లో చేరాయి. పైగా కాసిన కొద్దిపాటి కాయలు ఈదురుగాలులకు చెట్ల నుంచి నేలరాలుతున్నాయి. ప్రపంచంలో మామిడి సాగులో భారత దేశం అగ్రస్థానంలో ఉంది. మన రాష్ట్రంలోనూ అనేక ప్రాంతాల్లో మామిడి పంట సాగు అవుతుంది. ప్రధానంగా జిల్లాలోని నూజివీడు మామిడికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉంది. ప్రధానంగా నూజివీడు, చింతలపూడి, లింగపాలెం, టి.నరసాపురం, పెదవేగి ప్రాంతాల నుంచి రైతులు మామిడి పండ్లను తెల్లవారు జామునే ఏలూరు తీసుకు వచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. కాయ రకం సైజును బట్టి ఒక ట్రే రూ.600 నుంచి రూ.1200 పలుకుతుంది. ట్రేలో సైజును బట్టి 50నుంచి 60 మామిడి కాయలు ఉంటాయి.

ఏలూరు రైల్వే ట్రాక్ రోడ్డులో నిత్యం విక్రయాలు

ఏలూరు ఫ్లైఓవర్ ప్రక్కనే గల ట్రాక్ రోడ్డులో పెద్ద ఎత్తున వేసవిలో మామిడి కాయలను వేసవి సీజన్‌లో పెద్ద ఎత్తున విక్రయిస్తుంటారు. తెల్లవారు జామున సమీప ప్రాంతాల రైతులు ఆటోలు, ట్రాక్టర్లలో మామిడి కాయలను ఏలూరు తీసుకు వస్తుంటారు. వాటిని రిటైల్ వర్తకులు కొనుగోలు చేసి ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయేంత వరకూ విక్రయిస్తున్నారు. ఈ రోడ్డులో అరకిలో మీటరు పొడవునా మామిడి పండ్ల దుకాణాలు ఉన్నాయి. దాదాపు 200 మంది వరకూ చిన్న చిన్న వ్యాపారులు మామిడి పండ్లను విక్రయిస్తుంటారు. ఈ మార్గంలో ఉదయం పూట, సాయంత్రం పూట మామిడి పండ్ల కొనుగోలు కోసం వచ్చే జనం రద్దీతో కిటకిటలాడుతుంటుంది. వీరికి స్థానిక నగరపాలక సంస్థ అధికారులు సిబ్బంది తమ వంతు సహకారం అందిస్తుండటంతో వీరి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతుంది.

పరక లెక్కన విక్రయాలు



మామిడి పండ్లను విక్రయిస్తున్న మహిళ



మామిడి పండ్ల దుకాణం వద్ద ధరలను అడిగి తెలుసుకుంటున్న కొనుగోలు దారుడు

ఏలూరు లో మామిడి పండ్లను పరక లెక్కన విక్రయిస్తుంటారు. కాయ రకం, సైజును బట్టి పరక రూ.150 నుంచి రూ.600 వరకూ పలుకుతుంది. తాము ట్రేల లెక్కన రైతుల వద్ద నుంచి మామిడి పండ్లు కొనుగోలు చేసి వాటిని పరక(14కాయలు)ల లెక్కన విక్రయిస్తుంటామని అమ్మకం దారులు చెబుతున్నారు. రోజంతా ఎండలో అమ్మకాలు చేపడితే తమకు అన్ని ఖర్చులు పోను రూ.500 నుంచి రూ.1000 మిగులుతాయని అమ్మకం దార్లు చెబుతున్నారు.

దిగుబడులు తగ్గడంతో డిమాండ్ ఉంది



వేసవిలో ఏలూరు మార్కెట్‌కు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి మామిడి పండ్లను తీసుకు వస్తుంటారు. ప్రధానంగా చిన్న, పెద్ద, చెరకు రసాలు, బంగినిపల్లి మామిడి పండ్లకు మంచి గిరాకీ ఉంది. అయితే ఈ ఏడాది దిగుబడి తక్కువగా ఉండటంతో మామిడి పండ్ల ధరలు కొంచెం పెరిగాయి. అయినా వినియోగదారులు మామిడి పండ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

గొడేటి సుబ్బారావు, మామిడి పండ్ల వర్తకుడు,ఏలూరు

రోజుకు రూ.700 నుంచి రూ.1000 ఆదాయం వస్తుంది



ప్రతీ ఏటా మామిడి పండ్ల సీజన్‌లో స్థానిక ఓవర్ బ్రిడ్జి ప్రక్కన గల ట్రాక్ రోడ్డులో మామిడి పండ్లను విక్రయిస్తుంటాను. మాది ఏలూరుకు సమీపంలోని దుగ్గిరాల గ్రామం కావడంతో ప్రతి రోజు ఉదయాన్నే ఏలూరు వచ్చి హోల్ సేల్‌గా మామిడి పండ్లను కొనుగోలు చేసి రిటైల్‌గా విక్రయిస్తుంటాను. రోజుకు అన్ని రకాల పండ్లు కలిపి పది ట్రేల వరకూ విక్రయిస్తుంటాను. దీంతో అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.700 నుంచి రూ.1000 ఆదాయం లభిస్తుంది.

బూసి అంజమ్మ, మామిడి పండ్ల విక్రేత, దుగ్గిరాల,పెదవేగి మండలం

ఉపాధి పనుల పరిశీలన



కొవ్వలిలో ఉపాధి కూలీల మస్తర్లను తనిఖీ చేస్తున్న మండల ఏపీఓ దశరథ రామ్‌జీ

దెందులూరు: గ్రామాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల సంఖ్య మరింత పెరగాలని మండల ఏపీఓ దశరథ రామ్‌జీ అన్నారు. బుధవారం కొవ్వలి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీల మస్తర్లను, హాజరైన కూలీల సంఖ్యతో పోల్చి చూశారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మి, ఉపాధి కూలీల సంఖ్య, వారికి కల్పిస్తున్న సౌకర్యాలను ఏపీఓకు వివరించారు.

రేపు కల్నల్ రాకకు ఏర్పాట్లు ముమ్మరం



దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ కల్నల్ రాక సందర్భంగా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

దెందులూరు: సాల్వేషన్ ఆర్మీ కల్నల్ యాకుబ్ మసీ, సుమిత్రా మసీ శుక్రవారం దెందులూరు గ్రామానికి విచ్చేస్తున్నారని సాల్వేషన్ ఆర్మీ దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కే.రమణయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. దెందులూరులో 125 ఏళ్ల రక్షణ సైన్య ఆధ్యాత్మిక చరిత్ర కలిగిన దెందులూరు సాల్వేషన్ ఆర్మీ ప్రార్థనా మందిరం పునర్నిర్మాణానికి జరగనున్న శంకుస్థాపన కార్యక్రమానికి కల్నల్‌లు విచ్చేస్తున్నారన్నారు.

వసంతవాడలో లారీ బోల్తా



బోల్తా పడ్డలారీ

పెదపాడు: ధాన్యం లారీ బోల్తా పడటంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని వసంతవాడ గ్రామంలో అన్నపూర్ణ సీడ్స్ నుంచి మండపేట సమీపంలోని రామచంద్రపురానికి ధాన్యం లోడుతో వెళ్తున్న ఐసర్ వ్యాన్ వసంతవాడ శివారు ప్రాంతంలో రాత్రి 10 గంటల సమయంలో తిరగబడింది. దీంతో లారీ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో అతనిని వైద్యం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

గిరిజన గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి



సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): ఎన్నికల పేరుతో ప్రజా సమస్యలను వదిలేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. శుభ్రమైన మంచి నీరు లేక గిరిజనులు అతిసార,వ్యాధులు, విషజ్వరాలు బారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రభుత్వ అంబులెన్స్‌లు రన్నింగ్‌లో లేకపోవడం వల్ల సకాలంలో గిరిజన గూడెం ప్రజలకు వైద్యం అందటం లేదన్నారు. ఉపాధి కూలీల బకాయిలు జమ చేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల పరిణామాలను వివరించారు. కనీసం అధికారులైన ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ఈసమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి ప్రసాద్, పి.కిషోర్,ఆర్ లింగరాజు, జి.రాజు,ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు జి.నరసింహారావు, కె.శ్రీనివాస్, పివిరామకృష్ణ, బి.సోమయ్య, ఎం.జీవరత్నం, జి.వెంకట్రావు, టి.ముత్యాలమ్మ, యెస్ నరసింహ, ఏ.ఫ్రాన్సిస్, టి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పర్సా సత్యనారాయణ జీవితం కార్మిక వర్గానికి అంకితం



పర్సా సత్యనారాయణ వర్థంతి సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం

ఏలూరు (టూటౌన్): కార్మిక వర్గ హక్కుల రక్షణకై పోరాడిన మహోన్నత వ్యక్తి పర్సా సత్యనారాయణ అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. స్థానిక సీఐటీయు జిల్లా కార్యాలయంలో పర్సాసత్యనారాయణ 9వ వర్థంతి సభ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పర్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. అనంతరం మంతెన సీతారాం మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో పుట్టి పెరిగి సింగరేణి బొగ్గు గని కార్మికులను ఐక్యం చేసి పోరాటాల ద్వారా హక్కులు,చట్టాలు సాధించారన్నారు. విశాఖ ఉక్కు ఉద్యమంలో తన ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేసి ఉద్యమానికి బాసటగా నిలిచారని కొనియాడారు. ఏళ్ల తరబడి జైలు జీవితం అనుభవించి కార్మిక వర్గానికి అంకితమై పనిచేశారన్నారు. 1970లో సీఐటీయు ఏర్పడినప్పుడు నుంచి 25 సంవత్సరాలు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడిగా పనిచేశారన్నారు. ఈ సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్,ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వి.సాయి బాబు, బి.సోమయ్య, కె.విజయలక్ష్మి, జి.రవికిషోర్, ఎం.నాగమణి, వివిఎస్ ప్రసాద్, పి.కిషోర్, బి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.30	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	13

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21,.15	4822	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	14
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	10
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	27
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	18
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	23
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.10	98503	--
ఏలూరు - తిరుపతి	16.00	4830	32

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	--
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	58
వంకాయలు (తెలుపు)	52	ములక్కాడలు	04, 06
బెండకాయలు	44	కంద	64
పచ్చిమిర్చి	76	బీట్‌రూట్	36
కాకర కాయలు	52	కీరా దోస	30
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	--
బీరకాయలు (పందిరి)	54	అల్లం	180
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	36	పాలకూర	12
దొండకాయలు	36	చుక్కకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	30	గోంగూర	07
గోరుచిక్కుడు	48	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	44

కార్మికులకు వేతనాలు చెల్లించాలి



జెడ్పీ సీఈఓ సుబ్బారావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): శ్రీసత్యసాయి మంచినీటి పథకం కార్మికులకు వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన బుధవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా పరిషత్ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావులకు వినతి పత్రం అందజేశారు.అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సత్యసాయి మంచినీటి ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు నియోజక వర్గాల్లోని సుమారు 180 గ్రామాలకు 5లక్షల మంది ప్రజలకు తాగు నీరు సరఫరా జరుగుతుందన్నారు. ఈ పథకంలో 100 మంది కార్మికులు పనిచేస్తున్నారని వీరికి ఈ యేడాది జనవరి నుంచి జీతాలు చెల్లించలేదన్నారు. తక్షణమే కార్మికుల వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎంవిఆర్ఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, సభ్యులు టి.భాస్కర రావు, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కందుకూరి వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



సీఐటీయు కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ నిర్వహించే కందుకూరి 105వ వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్మాహక కమిటీ విజ్ఞప్తి చేశారు. సీఐటీయు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలో నిర్వాహక కమిటీ కన్వీనర్ ఎస్ఎన్ రమేష్ మాట్లాడారు. 100 సంవత్సరాల క్రితమే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, మహిళా విద్య కోసం మూడ నమ్మకాలకు వ్యతిరేకంగా పనిచేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి పీడీఎస్‌యూ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ లంకా వెంకటేశ్వర్లు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ బి.ఇమ్మానియేల్, సంకు మనోరమ, కె.అరుణ ఉపన్యాసకులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విజీఎంవిఆర్ కృష్ణారావు, ఆర్ లింగరాజు, వీవీ ప్రసాద్, పి.హైమావతి, పి.ఆదిశేషు, ఎస్ఎన్ కట్టా, పి.కిషోర్, జె.గోపి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ధ్యేయం



వినియోగదారుల హక్కులపై అవగాహన సదస్సులో నినాదాలు చేస్తున్న జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంత

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణ లక్ష్యంగా జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ లక్ష్యమని జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంత అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. అనంతరం జరిగిన జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, బాధ్యతపై అవగాహన సదస్సును నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా చైర్మన్ లింగంపల్లి మణికంఠ, ఏలూరు డివిజనల్ ఇంచార్జి సత్యేంద్ర, మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వర రావులు పాల్గొని ప్రసంగించారు. వినియోగదారుడా మేలుకో, హక్కులు, బాధ్యతలు తెలుసుకో అంటూ నినాదాలు చేశారు. టీవీ ఉమామహేశ్వరరావు చిన్నారులకు ఇంగ్లిషు భాషపై పట్టు సాధించేలా గ్రామర్‌పై శిక్షణ అందించారు. నీతి కథలు, జీకే అంశాలు, పుస్తక సమీక్షలు చేశారు. గుల్లా నూకరాజు పాల్గొన్నారు.

పోటీపరీక్షలకు సలహాలు ఇస్తా

ఉంగుటూరు: ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా విజయవాడ ఐఐటీ, జేఈఈ మెయిన్స్ కోచింగ్‌లో అనుభవం ఉన్న సీనియర్ అధ్యాపకుడు సీహెచ్ఎస్ సర్వేశ్వరరావు విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. బుధవారం గ్రంథాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యేవారికి సూచనలు సలహాలు అందజేస్తానని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే అనేక పుస్తకాలను శాఖాగ్రంథాలయానికి అందించారు. ఈ కార్యక్రమంలో తల్లాప్రగడ భీమేశ్వరరావు, పాతూరి వంశీకృష్ణ, కోసూరి సూర్యనారాయణ, గ్రంథపాలకుడు గంగాధరరావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భీమడోలు: క్షణికావేశంలో గుళికలు తిని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో చోటు చేసుకుంది. అతను చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే ఎంఎంపురం గ్రామానికి చెందిన పూనూరి నాగేశ్వరరావు(52) అనే వ్యక్తికి మద్యం సేవించే అలవాటుతో పాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం భార్య పార్వతి మద్యం తాగవద్దని మందలించింది. మనస్తాపానికి గురైన నాగేశ్వరరావు క్షణికావేశంలో గుళికలు తిగి అపస్మారక స్థితిలో చేరాడు. గుర్తించిన కుటుంబసభ్యులు నాగేశ్వరరావును వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు కేసు నమోదు చేశారు.